సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 10 । నవంబర్ । 2023



7కి.మీ. నడిస్తేనే ఓటు

ఓటింగ్ శాతం పెంచడంపై ఎన్నికల సంఘం శ్రద్ధ చూపుతున్నా వసతులు కల్పించడంలో విఫలమవుతోంది. 10లో▸



గెలుపెవరిదో ?

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి తాండూర్ ఎమ్మెల్యే స్థానానికి గురువారం ఎనిమిది నామినేషన్లు దాఖలయ్యాయి. 10లో▸



ఆగని ఇసుక అక్రమ దందా

పెద్దేముల్ మండలంలో ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. 11లో▸

సందడిగా వచ్చి.. నామినేషన్లు వేసి..



కొడంగల్‌లో మంత్రి పట్నంతో కలిసి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి



పరిగిలో నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి



తాండూరులో నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డి

న్యూస్‌రీల్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

జిల్లా న్యాయసేవ సంస్థ కార్యదర్శి శీతల్



మాట్లాడుతున్న డీజీ శీతల్

నవాబుపేట: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి డీబీ శీతల్ సూచించారు. నవాబుపేట ఆదర్శ పాఠశాలలోని బాలికల హాస్టల్లో వంట మనుషులు లేని విషయాన్ని విద్యార్థినులు సోషల్ మీడియాలో పెట్టడంతో వారు స్పందించారు. జిల్లా న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ కే సుదర్శన్ ఆదేశాల మేరకు జిల్లా, మండల అధికారులను పిలిపించి మాట్లాడారు. పాఠశాలలో జరుగుతున్నా విషయాలపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తినడానికి ఇబ్బందులు పడుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మరోసారి ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. వెంటనే వంట వారిని నియమించాలన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

డీఈఓ రేణుకాదేవి



గుబ్బడి పత్తేపూర్ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రేణుకాదేవి

నవాబుపేట: విధుల్లో అలసత్వం వహించే ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని డీఈవో రేణుకాదేవి హెచ్చరించారు. గురువారం మండలంలోని గుబ్బడి పత్తేపూర్ ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతం, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలపై విచారణ చేశారు. విధులకు సక్రమంగా రాని ఉపాధ్యాయురాలు హేమలతకు మేము జారీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. పిల్లలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఉపాధ్యాయుల పనితీరుపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గంజాడ ప్రాథమిక పాఠశాల, నవాబుపేట ఉన్నత పాఠశాలలో జరుగుతున్న సముదాయ సమావేశాల్లో పాల్గొని ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి గోపాల్, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, సీనియర్ అసిస్టెంట్ రాజేశ్వర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ రాదు.. రేవంత్ గెలవడు



కొడంగల్ రోడ్‌షోలో మంత్రులు కేటీఆర్, మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నరేందర్‌రెడ్డి

మంత్రి కేటీఆర్

- కొడంగల్‌పై వరాల జల్లు
- రోడ్ షోకు విశేష స్పందన
- వేలాదిగా తరలివచ్చిన జనం
- పీఎన్‌ఆర్‌ను గెలిపిస్తే ప్రమోషన్ ఇప్పిస్తానని హామీ

కొడంగల్: నియోజకవర్గంలో గులాబీ శ్రేణులు సత్తా చాటారు. రేవంత్‌రెడ్డి నిర్వహించిన సభకు దీటుగా జనం తరలివచ్చారు. నరేందర్‌రెడ్డి బలం నిరూపించుకున్నారు. గురువారం ఉదయం నుంచి కొడంగల్ నలుమూలలు గులాబీ జెండాలు రెపరెపలాడాయి. అడుగడుగునా అభిమానుల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి నెలకొంది. జనమా గులాబీ వనమా అనే రీతిలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి భారీగా తరలివచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం సాయంత్రం మంత్రి కేటీఆర్ కొడంగల్‌కు వచ్చారు. నిండు కుండలా కనిపించిన అంబేడ్కర్ కూడలిలో జనాన్ని ఉద్దేశించి మాట్లాడారు. కొడంగల్‌పై వరాల జల్లు కురిపించారు. నరేందర్‌రెడ్డిని గెలిపిస్తే ప్రమోషన్ ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. నవంబర్ 30న జరిగే ఎన్నికలు ఆశామాషీ కాదన్నారు. అత్యంత కీలకమైన ఎన్నికలని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన ఎన్నికలన్నారు. రెండు సార్లు కొడంగల్‌లో ఎమ్మెల్యేగా గెలిచిన రేవంత్‌రెడ్డి ప్రజలను పట్టించుకోలేదన్నారు. కొడంగల్‌లో నరేందర్‌రెడ్డిపై గెలవలేని రేవంత్‌రెడ్డి కేసీఆర్‌పై పోటీ చేస్తాడంట అని ఎద్దేవా చేశారు. దమ్ముంటే నరేందర్‌రెడ్డిపై గెలిచి నీ సత్తా ఏంటో నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ రాదని కొడంగల్‌లో రేవంత్ గెలవడని అన్నారు. నరేందర్‌రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

రెవెన్యూ డివిజన్‌గా మారుస్తాం

నరేందర్‌రెడ్డి రెండోసారి గెలిచిన తర్వాత కొడంగల్‌కు పదవీ యోగం లభిస్తుందన్నారు. కొడంగల్‌ను రెవెన్యూ డివిజన్‌గా మారుస్తామని హామీ ఇచ్చారు. మద్దూరు మండల కేంద్రాన్ని మున్సిపల్‌గా మారుస్తామన్నారు. దౌల్తాబాద్ మండలం చంద్రకల్ దగ్గర పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కొడంగల్‌లో ఇంజనీరింగ్ కళాశాల, బొంరాస్‌పేటలో జూనియర్ కళాశాల, నర్సింగ్ కళాశాల, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు మంజూరు చేస్తామన్నారు. నియోజకవర్గంలోని లక్షా 25వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తామన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం

బీఆర్ఎస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కొడంగల్ నియోజకవర్గంలో గడిచిన ఐదేళ్లుగా రూ.900 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. దీనిపై చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. కొడంగల్, కోస్గి మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. తొమ్మిదేళ్లలో 9 సార్లు కూడా కొడంగల్‌కు రాని వ్యక్తికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పిన రేవంత్‌రెడ్డి ఏం ముఖం పెట్టుకొని ఓట్లు అడుతున్నాడని అన్నారు. రేవంత్ స్థాయికి ముఖ్యమంత్రి కేసీఆర్ అవసరం లేదన్నారు. ముందు తనపై గెలవాలని సవాల్ విసిరారు. మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి రెండు సార్లు గెలిచి కొడంగల్ ప్రజలను పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మరని, బీజేపీకి ఉనికి లేదన్నారు.

గులాబీ శ్రేణుల్లో జోష్

మంత్రి కేటీఆర్ రోడ్ షోకు విశేష స్పందన వచ్చింది. భారీ ఎత్తున తరలివచ్చిన గులాబీ శ్రేణులు ఆనందంలో సంబరాలు చేసుకున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి విజయం ఖాయమైనట్లు కేటీఆర్ ప్రకటించారు.



తాండూరులో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న జనసేన పార్టీ అభ్యర్థి నేమూరి శంకర్‌గౌడ్



తాండూరులో బీజేపీ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న రమేష్‌కుమార్

రోహిత్‌రెడ్డితో నష్టపోయా

- చర్యలు తీసుకోవడంలో అధిష్టానం విఫలం
- అందుకే బీజేపీకి రాజీనామా
- పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీకృష్ణగౌడ్
- కాంగ్రెస్‌లో చేరుతానని వెల్లడి



మాట్లాడుతున్న మురళీకృష్ణగౌడ్

తాండూరు: బీజేపీ విధానాలు నచ్చక పార్టీకి రాజీనామా చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీకృష్ణగౌడ్ తెలిపారు. గురువారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాండూరులో బీజేపీ బలంగా ఉందని, ఈ స్థానాన్ని జనసేనకు కేటాయించడం సరికాదన్నారు. గతంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి బీజేపీ జాతీయ నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, అతన్ని కట్టడి చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. అగ్ర నాయకులు తీసుకుంటున్న విధానాల కారణంగా పార్టీ బలహీన పడుతోందని తెలిపారు. ఇవి నచ్చకే తాను పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. గతంలో తాను, రోహిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఉండేవారమని, 2018 ఎన్నికల్లో రోహిత్‌రెడ్డి గెలుపునకు తీవ్రంగా శ్రమించినట్లు తెలిపారు. గెలిచిన తర్వాత తనను దూరం పెడుతూ వచ్చారని, అంతేకాకుండా తన వ్యాపారాలకు తీవ్ర నష్టం కలిగించేలా వ్యవహరించారని వాపోయారు. తర్వాత బీజేపీలో చేరిన తనకు పార్టీ పెద్దలు సముచిత గౌరవం ఇచ్చారని తెలిపారు. పార్టీ నిర్ణయాలు సరిగ్గా లేకపోవడంతో రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు.

నామినేషన్ల కోలాహలం

- మంచిరోజు కావడంతో ఎక్కువ మంది దాఖలు
- పోటాపోటీగా జన సమీకరణ
- సందడిగా మారిన నియోజకవర్గ కేంద్రాలు

వికారాబాద్: నామినేషన్లు వేయడానికి ఒక్కరోజు మాత్రమే ఉండడం, గురువారం మంచిరోజు కావడంతో ఎక్కువ మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీలు తమ బలం నిరూపించుకునేందుకు పోటీ పడ్డాయి. భారీగా జన సమీకరణ చేయడంతో నియోజవర్గ కేంద్రాలు సందడిగా మారాయి. అన్ని పార్టీలు ర్యాలీలు, సభలతో హోరెత్తించాయి. ఈ నెల 3న ప్రారంభమైన నామినేషన్ల పర్వం నేటి(శుక్రవారం)తో ముగియనుంది. దీంతో జిల్లా వ్యాప్తంగా నాలుగు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు సమర్పించారు. చివరి రోజు శనివారం కూడా చాలా మంది నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఉదయం నామినేషన్ పత్రాలను ఇష్టమైన ఆలయాలకు తీసుకెళ్లి స్వామి, అమ్మవార్ల పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు చేయించారు.

ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ..

జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ ఇప్పటికే తమ నామినేషన్లు దాఖలు చేశారు. కొందరు పూర్తి స్థాయిలో నామినేషన్లు వేయగా, మరికొందరు డమ్మి సెట్లు వేసి చివరి రోజు మరో నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు. వికారాబాద్‌లో డాక్టర్ మెతుకు ఆనంద్(బీఆర్ఎస్), గడ్డం ప్రసాద్‌కుమార్(కాంగ్రెస్), పెద్దింటి నవీన్‌కుమార్(బీజేపీ), క్రాంతికుమార్(బీఎస్పీ) నామినేషన్లు దాఖలు చేశారు. తాండూరులో పైలెట్ రోహిత్ రెడ్డి(బీఆర్ఎస్), బుయ్యని మనోహర్‌రెడ్డి(కాంగ్రెస్), చివరి రోజు మరో సెట్ దాఖలు చేయనున్నారు. బీజేపీ - జనసేన పొత్తులో భాగంగా జనసేన అభ్యర్థి వేమూరి శంకర్‌గౌడ్ నామినేషన్ వేశారు. పరిగిలో కొప్పుల మహేశ్‌రెడ్డి (బీఆర్ఎస్), తమ్మన్నగారి రామ్మోహన్‌రెడ్డి(కాంగ్రెస్), బూనేటీ మారుతికిరణ్ (బీజేపీ), మరికొందరు నామినేషన్లు దాఖలు చేశారు. కొడంగల్‌లో పట్నం నరేందర్‌రెడ్డి(బీఆర్ఎస్) ఎనుముల రేవంత్‌రెడ్డి (కాంగ్రెస్), బంటు రమేశ్(బీజేపీ) తోపాటు మరికొందరు నామినేషన్లు వేశారు.

హోరెత్తిన నియోజకవర్గ కేంద్రాలు

గురువారం ఎక్కువ మంది అభ్యర్థులు నామినేషన్లు వేయడంతో నియోజకవర్గ కేంద్రాలు నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో హోరెత్తాయి. పలు చోట్ల ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేయడంతో ఆయా పార్టీల ముఖ్య నేతలు పాల్గొన్నారు. దీంతో సందడి వాతావరణం నెలకొంది. పరిగిలో కాంగ్రెస్ అభ్యర్థి టీ రామ్మోహన్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేయగా వేల సంఖ్యలో జనాలు హాజరయ్యారు. భారీ ర్యాలీతో వెళ్లి ఆయన నామినేషన్ వేశారు. కొడంగల్ బీఆర్ఎస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి భారీ ర్యాలీ, రోడ్ షోతో వెళ్లి నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ పాల్గొనడంతో కొడంగల్ మొత్తం కోలాహలంగా మారింది. తాండూరులో అధికార పార్టీ అభ్యర్థి పైలెట్ రోహిత్‌రెడ్డి సైతం భారీ ర్యాలీతో వెళ్లి నామినేషన్ వేశారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మూడు రోజుల క్రితమే కొడంగల్‌లో అట్టహాసంగా నామినేషన్ వేశారు. చివరి రోజు శుక్రవారం మరికొందరు తమ నామినేషన్లు దాఖలు చేయనున్నారు.

హామీల అమలులో కేసీఆర్ విఫలం

- కాంగ్రెస్ హయాంలోనే పేదలకు మేలు జరిగింది
- అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం
- డీసీసీ అధ్యక్షుడు, పరిగి అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి



ప్రజలకు నమస్కరిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

పరిగి: గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా సక్రమంగా అమలు కాలేదని డీసీసీ అధ్యక్షుడు, పరిగి అసెంబ్లీ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం పరిగిలో భారీ ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ చరిత్ర ఎంతో గొప్పదని, దేశ పురోగతిలో ముఖ్య భూమిక పోషించిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారని, డిసెంబర్ 3న అధికారంలోకి వస్తామన్నారు. ప్రజల ఆకాంక్షను గుర్తించిన సోనియా గాంధీ ప్రత్యేక తెలంగాణను ఇచ్చిందని, ప్రస్తుత ఎన్నికల్లో పార్టీని గెలిపించి ఆమెకు బహుమతి ఇవ్వాలని ప్రజలను కోరారు. గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా పరిగికి నీళ్లు తెస్తానని హామీ ఇచ్చారని, ఐదేళ్లు పూర్తయినా పనులను ప్రారంభించకపోవడం సిగ్గుచేటన్నారు. పేదలకు డబుల్ ఇళ్లు ఇస్తామని ఆశ పెట్టి ఒక్కరికి కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఊరికి వెళ్లినా కాంగ్రెస్ హయాంలో కట్టిన ఇందిరమ్మ ఇల్లు దర్శనమిస్తాయని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలు విసిగిపోయారని, అందుకే ఆ పార్టీ ఎమ్మెల్యేలను గ్రామాల్లోకి రానివ్వడం లేదని అన్నారు. సీఎం కేసీఆర్ మాయమాటలు చెప్పి రెండు సార్లు అధికారంలోకి వచ్చారని, ఆ సారి ఆయన ఆటలు సాగవన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు కాంగ్రెస్ నాయకులకు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పార్టీ ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాం రెడ్డి, దోమ ఎంపీపీ అనసూయ, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ బంగ్ల యాదయ్యగౌడ్, జిల్లా నాయకులు కద్మూర్ ఆనందం తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు సాధారణ పరిశీలకులు

వికారాబాద్ అర్బన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు గురువారం పోలీస్ పరిశీలకులు వచ్చారు. అనంతగిరి హరిత రిసార్ట్‌లో పరిశీలకులు సుధాకర్ గ్యాలగో, పీ ఆకాష్ ఠాకూర్ తాపలకు కలెక్టర్ నారాయణరెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. వికారాబాద్, పరిగి, నియోజకవర్గాలకు సుధాకర్(ఐఏఎస్) సాధారణ పరిశీలకులుగా, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాలకు పీ ఆకాష్(ఐఏఎస్) సాధారణ పరిశీలకులుగా వ్యవహరించనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల వ్యవహార శైలిని ఠాకూర్ తాప(ఐపీఎస్) పరిశీలించనున్నారు. కార్యక్రమంలో ఎస్పీ కోటిరెడ్డి, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు రాహుల్‌శర్మ, లింగ్యా నాయక్, శ్రీనివాసరావు, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, డీఆర్‌డీఓ కృష్ణన్, డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

అర్హులు విధిగా ఓటు వేయాలి

ప్రస్తుత ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ సీ నారాయణరెడ్డి సూచించారు. గురువారం కలెక్టరేట్ వద్ద ఓటరు చైతన్య రథాన్ని అధికారులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని సూచించారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటరు చైతన్య రథం ద్వారా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే సీ విజిల్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదు చేసిన వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. నగదు, మద్యం, కానుకలను పంపిణీ చేసినా, రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేసినా ఫిర్యాదు చేయాలని సూచించారు.



ఎన్నికల పరిశీలకులకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

క్లుప్తంగా

చెల్లీ.. నీ ఓటు మా ఆయనకే



మహిళకు బొట్టుపెట్టి ఓటు అభ్యర్థిస్తున్న కేఎస్ రత్నం సతీమణి ప్రమీల

షాబాద్: బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ రత్నంను అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించాలని ఆయన సతీమణి ప్రమీల, కూతురు డాక్టర్ ప్రణీత కోరారు. గురువారం షాబాద్ మండలం ఆస్పల్లిగూడ, చర్లగూడలో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలకు బొట్టుపెట్టి ఓటును అభ్యర్థించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

ఈసీ గుర్తిస్తేనే గ్లాసు గుర్తు

- తాండూరు జనసేన అభ్యర్థిని ఇండిపెండెంట్‌గా గుర్తించిన ఆర్‌ఓ
- ఈసీ అనుమతిస్తేనే పార్టీ గుర్తు కేటాయిస్తామని వెల్లడి



తాండూరు టౌన్: వికారాబాద్ జిల్లా తాండూరులో జనసేనఅభ్యర్థిగా నేమూరి శంకర్‌గౌడ్ గురువారం నామినేషన్ వేశారు. జనసేన తరఫున నామినేషన్ దాఖలు చేసినప్పటికీ ఎలక్షన్ కమిషన్.. ప్రస్తుతానికి ఆయనను స్వతంత్ర అభ్యర్థిగానే గుర్తించింది. రాష్ట్ర వ్యాప్తంగా 32 నియోజకవర్గాల్లోనే తమ పార్టీ పోటీ చేస్తుందని జనసేన ముందుగానే ఈసీకి తెలియజేసింది. ఇందులో తాండూరు పేరు లేకపోవడంతో శంకర్‌గౌడ్‌ను ఇప్పటివరకైతే ఇండిపెండెంట్‌గానే భావిస్తున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. తాండూరులో కూడా తమ పార్టీ అభ్యర్థి బరిలో ఉంటారని దరఖాస్తు చేసుకుంటే..ఈసీ ఈఅంశాన్ని పరిశీలిస్తుందని చెప్పారు. ఎలక్షన్ కమిషన్ నుంచి అనుమతి వస్తేనే అభ్యర్థికి గాజు గ్లాసు గుర్తు కేటాయిస్తామని.. లేదంటే స్వతంత్ర అభ్యర్థుల మాదిరిగానే సాధారణ గుర్తును కేటాయిస్తామని తెలిపారు. అయితే పొత్తులో భాగంగా బీజేపీ అధిష్టానం తాండూరు టికెట్‌ను జనసేనకు కేటాయించినప్పటికీ ఇక్కడ బీజేపీకి చెందిన ఓ సీనియర్ నేత రెబల్‌గా పోటీచేయడం సర్వత్రా ఆసక్తిగా మారింది

7 కి.మీ. నడిస్తేనే.. ఓటు

- తండాలకు దూరంగా పోలింగ్ కేంద్రాలు
- వాహన సౌకర్యంతో ప్రలోభాలకు అవకాశం
- ఈసీనే ఏర్పాటు చేయాలంటున్న గిరిజనులు



ముజాహిద్‌పూర్ పోలింగ్ కేంద్రం

కుల్కచర్ల: ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం శాయశక్తులా ప్రయత్నిస్తున్నా.. అందుకు అవసరమైన వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తోంది. ఓటు వేసేందుకు దూరభారాన్ని తగ్గించాల్సిన యంత్రాంగం అందుకు చర్యలు తీసుకోకపోవడంతో ఓటర్లకు ఇబ్బందులు తప్పడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు గ్రామాలకు దూరంగా ఉన్నాయంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు ఇక్కడి పోలింగ్ కేంద్రాలను నివాస ప్రాంతాల నుంచి 3 నుంచి 7 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేయడమే దీనికి కారణం.

నడక తప్పదు..

మండల పరిధిలోని గోగ్యానాయక్ తండా, సక్యానాయక్ తండా పరిధిలో 450 మంది ఓటర్లు ఉన్నారు. వారు అడవివెంకటపూర్ గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఓట్లు వేయాల్సి ఉంటుంది. దీని కోసం 3 కిలోమీటర్లు నడిచి వెళ్లాలి. వ్యక్తిగత వాహనాలు కొందరికే ఉండటంతో మిగతావారు ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది. అదేవిధంగా ముజాహిద్‌పూర్ పోలింగ్ బూత్ పరిధిలో పటేల్ చెరువు తండా, దాస్యనాయక్ తండా, సదన్ చెరువు తండాలకు చెందిన సుమారు 1600 మంది 7 కిలోమీటర్ల దూరం వెళ్లి ఓటు వేయాల్సిన పరిస్థితి. వీరిలో ఎక్కువ మందికి వాహనాలు లేకపోవడంతో సొంతంగా ఆటోలో వెళ్లడం లేదా ఆయా పార్టీల నాయకులు ఏర్పాటు చేసిన వాహనాల్లో వెళ్లి ఓటును వినియోగించుకోవాల్సిన పరిస్థితి. చాకల్‌పల్లి తండా, రాంరెడ్డిపల్లి, ఈర్లవాగుతండా, గుబ్బడితండా, బూరెడ్డిపల్లి, బంగ్రంపల్లి తదితర ప్రాంతాల్లో సైతం పోలింగ్ బూత్‌లు దూరంగా ఉండటంతో ఓటర్లకు ఇబ్బంది తప్పేలా లేదు.

ప్రలోభాలకు అవకాశం!

గిరిజన తాండాలు పోలింగ్ బూత్‌లకు దూరంగా ఉండటంతో సామాన్య ప్రజానీకం అక్కడికి వెళ్లేందుకు కొంత ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఆయా గ్రామాలకు చెందిన ఓటర్లకు వాహనాలు ఏర్పాటు చేసి ప్రలోభాలకు గురిచేసి ఓట్లు వేయించుకునే అవకాశం ఉంది. పోలింగ్ కేంద్రాలు ప్రజల నివాసానికి దగ్గరగా ఏర్పాటు చేసి ఉంటే బాగుండేదని ఓటర్లు అభిప్రాయపడుతున్నారు.

దూరంగా పోలింగ్ కేంద్రాలు



మెజార్టీ గిరిజన జీపీల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. పోలింగ్ కేంద్రాలు తండాలకు దూరంగా ఉన్నాయి. ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత వాహనాలు లేకపోవడంతో నాయకులు ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉంది. – **రవి, సర్పంచ్, గోగ్యనాయక్ తండా**

వాహన సౌకర్యం కల్పించాలి



మా తండా నుంచి పోలింగ్ కేంద్రం చాలా దూరంగా ఉంది. రోడ్డు మార్గం సరిగా లేదు. పోలింగ్ కేంద్రాలకు వాహన సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది. అందుకు అనుగుణంగా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి. – **శ్రీనివాస్, ధాక్యనాయక్ తండా**

ప్రచార కూలీలు

- జోరందుకున్న ఎన్నికల ప్రచారం
- ర్యాలీలు, సభలకు భారీగా జనసమీకరణ
- అడిగినంతా ఇస్తామంటేనే ర్యాలీల్లోకి కూలీలు
- మద్యం, హోటళ్లు, పూలదండలకు భలే గిరాకీ



షాబాద్: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు పోటాపోటీగా ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. అన్నివర్గాల ప్రజలను ఆకర్షించేలా భారీ ర్యాలీలు.. మైకుల మోత.. కళాకారుల కోలాట నృత్యాల నడుమ ఓటర్లను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రధాన నాయకుల వెంట ఎల్లప్పుడూ పెద్ద ఎత్తున ప్రజలు ఉండేలా చూసుకుంటున్నారు. అభ్యర్థులు ఓట్ల కోసం చెమటోడుస్తుండగా మరో వైపు మద్యం, బిర్యానీ సెంటర్లు, పూలదండలు, బొకేల వ్యాపారం ఊపందుకుంది.

పూలదండలకు గిరాకీ...

కండువా మారుస్తున్నా, ప్రచారం కోసం ఊర్లోకి వచ్చే అభ్యర్థికి స్వాగతం పలకాలంటే పూలదండలు, శాలువాలు ముఖ్యం. దీంతో సాధారణ రోజుల కంటే ఎన్నికల సమయంలో దండల అమ్మకాలు పెరిగాయి. ఆయా పార్టీల అభ్యర్థులు తమ ఇంటి నుంచి ప్రచారం మొదలు చేసిన సమయం నుంచి తిరిగి వచ్చే వరకు అభిమానులు పూలదండలతో వారిని ముంచెత్తుతున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా పూల దండలు తయారు చేసే వ్యాపారులకు చేతినిండా పని దొరికినట్లయ్యింది.

బీరు..బిర్యానీ

పార్టీల కోసం ప్రచారం చేసే నాయకులంతా పొద్దంతా కష్టపడి సాయంత్రం బీరు, బిర్యానీతో చిల్ అవుతున్నారు. ఎన్నికల ర్యాలీల పుణ్యమా అని జిల్లాలో మద్యం అమ్మకాలు అమాంతంగా పెరిగిపోయాయి. శ్రేణులు చేజారిపోకుండా మందు పార్టీలు ఏర్పాటు చేస్తున్నారు అభ్యర్థులు. దీంతో వంటలు, కేటరింగ్ చేసేవారికి చేతినిండా పని దొరుకుతుండగా.. బిర్యానీ సెంటర్లకు గిరాకీ పెరిగింది.

కళాకారుల ఆటాపాట..

ఎన్నికల ప్రచారంలో ప్రజలను ఉత్తేజ పర్చాలంటే కళాకారుల ఆటాపాట ఉండాల్సిందే. ప్రచార జోరులో కళాకారులు హోరెత్తిస్తున్నారు. కళాకారుల పాడే పాటలతో ప్రచారానికి ఊపొస్తుంది. కళాకారులతో పాటు కోలాటం, బతుకమ్మ ఆడే మహిళలకు ఉపాధి బాగా దొరుకుతోంది.

సామాజిక మధ్యమాల ద్వారా..

ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు అందివచ్చిన ప్రతీ అవకాశాన్ని తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. ప్రచారంలో కీలక భూమిక పోషిస్తున్న సామాజిక మాధ్యమాలను పూర్తిగా వినియోగించుకుంటున్నారు. వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌తో పాటు ఎస్ఎంఎస్‌లు, వాయిస్ కాల్స్‌తో నిత్యం ఓటర్లకు చేరువవుతున్నారు. దీంతో డిజిటల్ మార్కెటింగ్ చేసే చాలామందికి చేతినిండా పని లభిస్తోంది.

వాహనాలకు డిమాండ్..

ప్రచారం ఊపందుకోవడం, పార్టీల ముఖ్య నేతల ప్రచార సభల నేపథ్యంలో ట్యాక్సీలు, ట్రావెల్స్‌కు డిమాండ్ ఉంది. ప్రచారానికి నియోజకవర్గ స్థాయిలో తిరుగుతున్న సమయాల్లో పార్టీల అనుచరగణాన్ని తరలించేందుకు ప్రైవేటు వాహనాలను మాట్లాడుకుంటున్నారు. అలాగే నియోజకవర్గం, జిల్లా పరిధిలో నిర్వహించే సభలకు వందల సంఖ్యలో వాహనాలు అవసరమవుతున్నాయి.

బిజీగా కూలీలు...

ఎన్నికల పండగ రావడంతో రోజువారీ కూలీలకు డిమాండ్ బాగా పెరిగింది. కూలిపని చేసి రోజంతా కష్టపడి పనిచేస్తే వచ్చే కూలీకంటే ప్రచారంలో పాల్గొంటే వచ్చే డబ్బులు ఎక్కువగా ఉండటంతో వారు ర్యాలీల్లో పాల్గొంటున్నారు. అభ్యర్థి ప్రచారానికి వెళ్లే సమయంలో తమ వెంట జనం కనిపించేలా ముందుగానే కూలీలను బుక్ చేసుకుంటున్నారు.

ఓటు @ ఐదు రకాలు

వివిధ హోదాల్లో వినియోగం

షాద్‌నగర్: ఎన్నికలు అంటేనే అందరికి గుర్తుకు వచ్చేది ఓట్లు. ఐదేళ్ల పాలించే నాయకుడిని ఎన్నుకోవాలంటే ఓటుహక్కు తప్పనిసరిగా ఉండాలి. ఎన్నికలు వచ్చాయంటే చాలు ఓటర్ల జాబితాలో తమపేరు ఉందో లేదో అని అందరూ ఓసారి సరి చూసుకుంటారు. అయితే ఓటుహక్కు కలిగి ఉండి పోలింగ్ బూత్ నుంచి తిరిగి బయటికి వేలికి సిరా వేసుకుని వచ్చేటప్పుడు ఓటరు మొహంలో ఎనలేని ఆనందం కనిపిస్తుంది. అదే కొత్త ఓటరు అయితే ఆ ఆనందం రెట్టింపు అవుతుంది. అయితే ఓట్లలో పలు రకాలు ఉంటాయని చాలామందికి తెలియదు. ఓట్లలో మొత్తం 5 రకాలు ఉంటాయి. వివిధ హోదాల్లో వీటిని వినియోగించుకోవచ్చు. ఓసారి వాటిని పరిశీలిస్తే..

1. సాధారణ ఓటు

భారత రాజ్యాంగం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును కల్పించింది. ఇలా ఓటు హక్కును పొందినవారు తమకు నచ్చిన నేతకు ఓటు వేసుకునే అవకాశం ఉంది. పోలింగ్ బూత్‌లోకి వెళ్లి మామూలుగా ఓటువేస్తే దాన్ని సాధారణ ఓటు అంటారు.

2. పోస్టల్ బ్యాలెట్

ఎన్నికలు సజావుగా కొనసాగాలంటే చాలామంది ఇందుకు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అధికారులు, ఉద్యోగులు, జర్నలిస్టులు ఓటు వేసేందుకు గ్రామాలకు పట్టణాలకు వెళ్లి ఓటుహక్కును వినియోగించుకోలేరు. ఇందుకు గాను ఎన్నికల సంఘం ఉద్యోగులు, అధికారుల కోసం పోస్టల్ బ్యాలెట్‌ను ప్రవేశపెట్టింది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా వారికి నచ్చిన వారికి ఓటు వేసి ఎన్నికల అధికారులకు ముందుగానే పంపించవచ్చు.

3.సర్వీస్ ఓటు

దేశ రక్షణలో భాగంగా చాలామంది సైనికులు, పారామిలటరీ ఉద్యోగులు స్వరాష్ట్రానికి వెళ్లి ఓటుహక్కును వినియోగించుకోలేరు. తమకు నచ్చిన నాయకుడికి ఓటు వేసేందుకు వీలుగా ఎన్నికల సంఘం వీరికి వెసులుబాటు కల్పించింది. వీరిని సర్వీసు ఓటర్లుగా గుర్తించి.. వారి కోసం ప్రత్యేకంగా సర్వీసు ఓటును కల్పించింది. వీరు సర్వీస్‌లో ఉన్న ప్రాంతం నుంచే ఓటు వేయవచ్చు.

4.టెండర్ ఓటు

ఓటరు జాబితాలో పేరు ఉండి పోలింగ్ బూత్‌లోకి వెళ్లిన తర్వాత తమ ఓటును వేరొకరు వేశారని తెలిస్తే ఎంతో కోపం వస్తుంది. తాము ఎన్నికల్లో ఓటు వేయలేదని.. తమ ఓటును ఎవరో వేశారని ఎన్నికల అధికారులకు సంతృప్తి పరిచే విధంగా చెప్పగలగాలి. నిజంగా ఓటును ఇతరులు వేశారని తెలుసుకొని అధికారులు సంతృప్తి చెందితే అప్పుడు వారికి ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తారు. దీన్నే టెండర్ ఓటు అంటారు.

5.ప్రాక్సీ ఓటు

కేంద్ర నిఘా సంస్థలు, గూఢాచారి సంస్థల సిబ్బంది తమ ఉనికిని మరెవరికి తెలియనీయకుండా గోప్యంగా ఉంటారు. వారు తన ప్రతినిధిగా మరెవరినైనా పంపించి ఓటు వేయవచ్చు. ఈ విధమైన ఓటు హక్కునే ప్రాక్సీ ఓటు హక్కు అంటారు.

కాషాయ జెండా ఎగురవేస్తాం

- సబితారెడ్డి, కేఎల్ఆర్‌ను చిత్తుగా ఓడించండి
- అందెల నామినేషన్ ర్యాలీలో బండి సంజయ్



అభివాదం చేస్తున్న బండి సంజయ్, అందెల

మహేశ్వరం: మహేశ్వరం గడ్డపై కాషాయ జెండా ఎగురవేయడం ఖాయమని బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ పేర్కొన్నారు. గురువారం ఆ పార్టీ మహేశ్వరం అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న బండి మాట్లాడుతూ.. సబితారెడ్డి, కేఎల్ఆర్‌ను చిత్తుగా ఓడించి ఇంటికి పంపాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. మన్సాన్‌పల్లి, మంఖాల్, సర్దార్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను స్థానికులకు కాకుండా పాతబస్తీకి చెందిన ఎంఐఎం కార్యకర్తలకు ఇచ్చారని ఆరోపించారు. అందెల శ్రీరాములు మాట్లాడుతూ.. పారదర్శకమైన, సుస్థిర పాలన బీజేపీతోనే సాధ్యమని తెలిపారు. మహేశ్వరంలో స్థానికేతరులకు ఓటుతోనే తగిన బుద్ధి చెప్పాలని.. లోకల్ అభ్యర్థినైన తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ప్రవీణ్, పాపయ్యగౌడ్, సుదర్శన్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి, జంగయ్య యాదవ్, చంద్రయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరులో గెలుపెవరిదో?



నామినేషన్ వేస్తున్న బహుజన్ లెఫ్ట్ పార్టీ అభ్యర్థి సునీల్‌కుమార్

- అసెంబ్లీ స్థానానికి గురువారం ఎనిమిది నామినేషన్లు
- బీఆర్ఎస్ నుంచి రోహిత్‌రెడ్డి, ప్రమోదిని
- కాంగ్రెస్ అభ్యర్థిగా మనోహర్‌రెడ్డి
- బీజేపీ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన రమేష్ కుమార్
- బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా శంకర్‌గౌడ్

తాండూరు టౌన్: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి తాండూరు ఎమ్మెల్యే స్థానానికి గురువారం ఎనిమిది నామినేషన్లు దాఖలయ్యాయి. తాండూరు బీఆర్ఎస్ అభ్యర్థిగా పైలట్ రోహిత్‌రెడ్డి.. ఎంపీ రంజిత్‌రెడ్డితో కలిసి వచ్చి నామినేషన్ వేశారు. అలాగే రోహిత్‌రెడ్డి తల్లి, వికారాబాద్ జెడ్పీటీసీ ప్రమోదిని కూడా బీఆర్ఎస్ నుంచి నామినేషన్ వేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మనోహర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. గౌరి శ్రీశైలం ధర్మ సమాజ్ పార్టీ తరుపున నామినేషన్ వేశారు. అలాగే సునీల్ కుమార్ బహుజన లెఫ్ట్ పార్టీ తరుపున, మంబాపూర్ విజయేందర్ స్వతంత్ర్య అభ్యర్థిగా నామినేషన్ వేశారు. కాగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ ఆ పార్టీ నుంచి నామినేషన్ వేయగా, జనసేన పార్టీ తరుపున నేమూరి శంకర్‌గౌడ్ నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆయా నేతల అభిప్రాయాలు మీకోసం..

నల్లేరుపై నడకే



రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ హవా నడుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో 75కి పైగా స్థానాలు గెలుస్తాం. తాండూరులో నా గెలుపు నల్లేరుపై నడకే. నియోజకవర్గంలో నేను చేసిన అభివృద్ధి పనులు చూసి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. వారి ఆశీస్సులతో రెండోసారి విజయం సాధిస్తాను. – **రోహిత్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి**

భారీ మెజార్టీతో గెలుస్తా



అవినీతి, అరాచక పాలన కొనసాగిస్తున్న బీఆర్ఎస్ పార్టీని తరిమికొట్టే సమయం వచ్చింది. తాండూరు ఎమ్మెల్యే, ఆయన అనుచరులు చేసిన భూకబ్జాలను ప్రజల ముందు ఉంచుతాం. ప్రజలంతా కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారు. తాండూర్ నుంచి భారీ మెజార్టీతో గెలిచి చూపిస్తా.

– **మనోహర్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి**

అధిష్టానం పునరాలోచించాలి



తాండూరులో బలంగా ఉన్న బీజేపీకి టికెట్ కేటాయించకుండా పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించడంపై అధిష్టానం పునరాలోచించాలి. స్థానికంగా బీజేపీకి బలమైన కేడర్ ఉంది. టికెట్ కోసం చివరి వరకు ప్రయత్నిస్తాను. తర్వాత అధిష్టానం నిర్ణయానికే కట్టుబడి ఉంటాను. – **రమేష్ కుమార్, బీజేపీ రెబల్ అభ్యర్థి**

బీజేపీ మద్దతుతో గెలుస్తా



పొత్తులో భాగంగా తాండూరులో జనసేన అభ్యర్థిగా నామినేషన్ వేశాను. బీజేపీ మద్దతుతో విజయం సాధిస్తాననే నమ్మకం ఉంది. స్థానిక బీజేపీ నాయకులను కలుపుకొని వెళ్తాను. బీజేపీ సీనియర్ నేత రమేష్ నామినేషన్ (రెబల్ అభ్యర్థిగా) వేసినప్పటికీ అధిష్టానం నిర్ణయం మేరకు నాకు సహకరిస్తారని ఆశిస్తున్నాను.

– **శంకర్ గౌడ్, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి**



శివలింగానికి పూజలు చేస్తున్న యాదయ్య దపంతులు

స్వామీ.. ఆశీర్వదించు

నవాబుపేట: మండల పరిధిలోని ఎల్లకొండ పార్వతీపరమేశ్వర, సాయిబాబా ఆలయాల్లో గురువారం ఎమ్మెల్యే కాలె యాదయ్య దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. నామినేషన్ వేయడానికి ముందు యాదయ్య ఇక్కడ ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఎన్నికల్లో గెలుపొందేలా దీవించాలని దేవుళ్లను వేడుకున్నారు.



టీఆర్ఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన శరత్‌కుమార్‌రెడ్డి

హస్తం గూటికి కేఎస్ఆర్

పరిగి: కేఎస్ఆర్ ట్రస్ట్‌తో నియోజకవర్గ ప్రజలకు నిత్యం సేవలందిస్తున్న ట్రస్ట్ చైర్మన్ శరత్ కుమార్‌రెడ్డి, ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ గురువారం డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా టీఆర్ఆర్ మాట్లాడుతూ.. కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరడం శుభపరిమాణమన్నారు. పార్టీలో వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు అజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు నామినేషన్ వేయనున్న సబితారెడ్డి

మహేశ్వరం: బీఆర్ఎస్ అభ్యర్థి పట్లోళ్ల సబితారెడ్డి శుక్రవారం తన అనుచరులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీతో వచ్చి నామినేషన్ వేయనున్నారు. ఉదయం 9 గంటలకు కర్మాన్‌ఘట్ హనుమాన్ ఆలయంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి బయలుదేరి బాలాపూర్ చౌరస్తా, శివాజీ చౌక్, పహాడిషరీఫ్, తుక్కుగూడ, మహేశ్వరం గేటు, మహేశ్వరం తహసీల్దార్ కార్యాలయం వరకు అనుచరులు, కార్యకర్తలతో కలిసి భారీ బైక్ ర్యాలీతో వచ్చి నామినేషన్ దాఖలు చేయనున్నారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ నేతలు పేర్కొన్నారు.